క్లుప్తంగా

నేటి నుంచి ఉత్సవాలు

వెల్దండ: మండలంలోని బైరాపూర్‌లో ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 20న మేదిన పూజ, విశ్వక్సేన ఆరాధన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షం పొందాలని కోరారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



కల్వకుర్తి టౌన్: ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎమ్మెల్యే నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా ఆరోగ్య శిబిరానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వైద్య పరీక్షలు పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల కోసం వైద్య శిబిరం నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. మున్సిపల్ చైర్మన్ సత్యం, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలి



నాగర్‌కర్నూల్: ప్రతిఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమన్ దాస్ రాజేష్ గౌడ్ అన్నారు. మే 20న జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని నాగర్ కర్నూల్ జిల్లా ఎన్టీఆర్ అభిమానుల ఆధ్వర్యంలో పాలమూరు బ్లడ్ బ్యాంక్ వారి సహకారంతో స్థానిక లిటిల్ ఫ్లవర్ స్కూల్లో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో అభిమానులు కుమార్, కార్తీక్, గిరి, డప్పు రవి, బాలరాజు అభిమానులు పాల్గొనడం జరిగింది.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయండి

కోడేరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని స్థానిక విద్యార్థులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. మండల కేంద్రంలో ఇంటర్ విద్య వరకే ఉందని డిగ్రీ చదవేందుకు నాగర్‌కర్నూల్, వనపర్తి, కొల్లాపూర్ వెళ్లాల్సిన పరిస్థితి ఉందని దీంతో ప్రభుత్వం డిగ్రీ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. పేద విద్యార్థులు చదువు మధ్యలోనే నిలిపివేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం



ఉప్పునుంతల: మండల కేంద్రం సమీపంలోని మర్రిపల్లి రోడ్డు మార్గంలో గత పది రోజుల కిందట వీచిన బలమైన ఈదురు గాలులకు రోడ్డు పక్కన ఉన్న చెట్టు విరిగి 11 కేవీఏ విద్యుత్ లైన్‌పై పడటంతో స్తంభాలు విరిగి పడ్డాయి. దీంతో విద్యుత్ తీగలు రోడ్డుపై పడ్డాయి. ఈ మార్గంలో వెళ్లే వాహనాదారులు, ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. విద్యుత్ లైన్‌ను బాగుచేయడానికి విద్యుత్ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి ప్రమాద భరితంగా పడిఉన్న విద్యుత్ లైన్‌ను బాగుచేయించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

కల్వకుర్తిరూరల్: మండలంలోని వెంకటాపూర్‌లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. విద్యుత్ అధికారులు కంచె ఏర్పాటు చేయలేదు. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో పిచ్చిగడ్డి ఏపుగా పెరిగి ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకుండా పోయే అవకాశం ఉందని గ్రామస్తులు వాపోయారు. దీంతో అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



వానాకాలం సాగు అయ్యేనా?



ఆయకట్టు కాల్వలు



శిథిలావస్థకు చేరిన తూం



వెడల్పు తగ్గుతున్న చీకటి చెరువు ఆనకట్ట

- సాగునీరు అందక రైతన్న దిగాలు

లింగాల: గ్రామాల్లో చెరువులు పూర్తిస్థాయిలో నిండితేనే పంటలు పుష్కలంగా పండుతాయి. సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం చెరువులలో పూడికతీత, మరమ్మతు పనులు చేపట్టింది. కాని మండలంలోనే అతి పెద్ద చెరువైన చీకటి చెరువు మరమ్మతుకు నోచుకోక పోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. వానాకాలం పంట సాగు చేసేందుకు సందిగ్ధంలో పడ్డారు. ఈ సారి ఆయకట్టు సాగు ప్రశ్నార్థకంగా మారింది. కొన్నేళ్ల నుంచి చెరువు కింద సాగు నీటి కాల్వలకు, తూంలకు ఎలాంటి మరమ్మతు చేపట్టక పోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దాదాపుగా 500 ఎకరాల ఆయకట్టు ఉన్న ఈ చెరువు నిర్వహణ విషయంలో నీటి పారుదల శాఖ వారు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆయకట్టు సాగు తగ్గే అవకాశం ఉంది. చెరువు కింద క్యాంపు రాయవరం, దారారం, రాయవరం గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు చీకటి చెరువుపై ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు.

నీటి పారుదల కాల్వలు లేక ఇక్కట్లు

చెరువు ఆయకట్టు భారీగా ఉన్నప్పటికి చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందక పోవడంతో రైతులు తమ పొలాలను బీళ్లుగా ఉంచుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న నీటి పారుదల కాల్వలు శిథిలావస్థకు చేరడం, కొద్ది దూరం మాత్రమే కాల్వలను నిర్మించి వదిలేశారు. పొలాలను సాగు చేసిన రైతులు తాత్కాలికంగా కాల్వలను ఏర్పాటు చేసుకొని నీటిని వాడుకుంటున్నారు.

వెడల్పు తగ్గుతున్న చెరువు ఆనకట్ట

ఏటేటా కురుస్తున్న వర్షాలకు చెరువు ఆనకట్ట వెడల్పు కుంచించుకుపోతోందని రైతులు వాపోతున్నారు. చెరువు సామర్థ్యం కూడా తగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు రెండు భారీ వాహనాలు వెళ్లేంత వెడల్పుగా ఆనకట్ట ఉండేదని ప్రస్తుతం వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. కట్టపై చెట్ల పొదలు పెరగడం, కాలిబాటగా మారింది. చెరువు నిర్వహణ విషయంలో సంబంధిత నీటి పారుదల శాఖ వారు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

శిథిలావస్థకు చేరిన తూం

చెరువు నీరు ఆయకట్టుకు చేర్చుటకు నిర్మించిన తూం శిథిలావస్థకు చేరింది. తూం ద్వారా పొలాలకు సక్రమంగా నీరందక పోవడం వలన ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి పారుద శాఖ వారు స్పందించి చెరువు మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

మరమ్మతు చేపడతాం

చీకటి చెరువును పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. ఏఏ పనులు చేపట్టాలో అంచనా వేసి నిధులు మంజూరుకు ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. నిధులు విడుదల అయితే మరమ్మతు పనులు చేపడుతాం.

– పరమేష్, ఇరిగేషన్ ఏఈ, లింగాల

శివలింగానికి ప్రత్యేక పూజలు



అభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

నాగర్‌కర్నూల్: జిల్లా కేంద్రంలోని ఓంనగర్ కాలనీ పాత రవితేజ కళాశాల వెనుక పబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయంలో వైశాఖ ఏకాదశి సందర్భంగా ఆదివారం శివలింగానికి భక్తులు పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో ఏక పారాయణ రుద్రాభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణ మార్మోగింది. అదేవిధంగా గణపతి, అమ్మవారు, సూర్య భగవాన్, విష్ణుమూర్తి, నాగులకు అభిషేక పూజలు చేశారు. అనంతరం హనుమాన్ దేవాలయంలో స్వామివారికి అష్టోత్తరంతో అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మాడభూషి అజయ్ కుమార్ శర్మ, అర్చకులు శ్రీనివాసచార్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నేషనల్ హైస్కూల్ 1989-90 బ్యాచ్ విద్యార్థులు

నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ పట్టణంలోని మైత్రీ ఫంక్షన్ హాలులో పట్టణంలోని నేషనల్ హైస్కూల్‌కు చెందిన 1989 -90 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ముందుగా గతంలో మృతిచెందిన ఐదు మంది మిత్రులకు నివాళులర్పించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి రూ. లక్ష చొప్పున అందజేశారు. అనంతరం ఒకరికొకరు ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ప్రభాకర్, రవికుమార్, సురేందర్, పరమేశ్వర్, రమేష్ గౌడ్, జి సత్యం, సురేష్, నూర్ మహమ్మద్, హమిత్ ఖాన్ పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో ఆదివారం పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎస్‌ఏవీ గుప్త ఉన్నత పాఠశాలలో 1997– 98 చదివిన విద్యార్థులు కలుసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.

చారకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–2003 పదవ తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 21 సంవత్సరాల తరువాత స్నేహితులు కలుసుకోవడంపై సంతోషం వ్యక్తం చేశారు. అప్పటి గురువులను సన్మానించారు.



కోడేరులో

కోడేరు: మండల కేంద్రంలోని 1993–94 పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉపాధ్యాయులు నాగేశ్వరెడ్డి, లక్ష్మిరెడ్డి, దొరస్వామి, దేంవేంద్రం, విష్ణు, పూర్వ విద్యార్థులు డి. విజయ్ రెడ్డి, వడ్ల నరేందర్, కర్ణకర్, భవానిశంకర్, ఉమ, మమత, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలు సాధిద్దాం



కల్వకుర్తిలో నివాళులర్పిస్తున్న నాయకులు



తెలకపల్లిలో నివాళులర్పిస్తున్న శ్రీనివాసులు

కల్వకుర్తిరూరల్: సుందరయ్య ఆశయాలు సాధిద్దామని కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా కార్యదర్శి పరశురాములు, కే వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని యూటీఎఫ్ భవనంలో సుందరయ్య 39వ వర్ధంతిని సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించి 10 లక్షల ఎకరాల భూపంపిణీ జరిగేవిధంగా సుందరయ్య కృషి చేశారన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, మల్లయ్య, శ్రీనివాసులు, బాలయ్య, కిశోర్, నెహ్రూప్రసాద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్ శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు గోపస్ లక్ష్మన్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

అచ్చంపేట రూరల్: మండలంలోని సింగారంలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దేశ్యానాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు మల్లేష్, చిన్నయ్య, ఆంజనేయులు, అంతయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంలో నిర్వహించిన సుందరయ్య వర్ధంతిలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కాశన్న హాజరయ్యారు. నాయకులు కాశన్న, చెన్నయ్య, వెంకటస్వామి, రామస్వామి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో సుందరయ్య చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, దశరథం, బాలస్వామి, వెంకటయ్య, రాములు, మద్దిలేటి, మల్లయ్య, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: పట్టణంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ హాజరయ్యారు.

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లిలో సుందరయ్య చిత్ర పటానికి సీపీఎం మండల కార్యదర్శి చింతల నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. కిష్టయ్య, వెంకటయ్య, రాములు, నిరంజన్, లక్ష్మయ్య, శ్రీను, గెల్వయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అందరూ చదువులో రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

గోపాల్‌పేట: ప్రతిఒక్కరూ చదివి అత్యున్నత స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బుద్ధారంలో విశ్వవాణి గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఇంగ్లీష్ గ్రామర్ సమ్మర్ కోచింగ్ ముగింపు కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకరమన్నారు. విద్యార్థులు ఇంగ్లీష్‌పై పట్టుసాధిస్తే ఎన్నో లాభాలు ఉంటాయని అన్నారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం ఎన్నో మంచి పథకాలు అమలు చేయబోతోందని అన్నారు. ఏప్రిల్‌లో ప్రారంభమైన గ్రామర్ శిక్షణ నేటితో పూర్తయిందని సంఘం నాయకులు తెలిపారు. మొత్తం 150 మంది కోచింగ్ తీసుకున్నారని వివరించారు. నేటి నుంచి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో 45 రోజుల పాటు మూఢనమ్మకాలు, అపోహలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారని, అందరూ హాజరు కావొచ్చని నిర్వాహకులు తెలియజేశారు.

నిలిచిన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు



ఇంద్రకల్‌లో పునాదులకే పరిమితం అయిన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు

తాడూరు: మండలంలోని ఇంద్రకల్‌లో దాదాపు ఎనిమిది ఏళ్ల కిందట డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటికీ పునాదుల వరకే నిర్మాణ పనులు ఆగిపోవడంతో ప్రజల్లో నిరాశ ఎదురైంది. హడావుడిగా నిర్మాణ పనులను చేపట్టారు తప్పా పూర్తి చేయాలని ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. నిధుల కొరత కారణంగా పునాదులకే పరిమితం అయ్యి పనులు నిలిచిపోయాయి. అదేవిధంగా మండల కేంద్రంలోని కోనొంపు గుట్ట ప్రాంతంలో డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం నాలుగేళ్ల కిందట చేపట్టారు. ఇక్కడ కూడా నిధుల కొరతతో పనులు నిలిపివేశారు.



ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిలిచిన నిర్మాణ పనులను పరిశీలించి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేశారు.

బీసీ కుల గణన చేపట్టాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: జీఓ నంబర్ 26 ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే బీసీల కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్, పొలిటికల్ జేఏసీ నాయకులు అరవిందాచారి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. బీసీ లెక్కలు తేల్చిన తర్వాతే స్థానిక సంస్థలను ఎన్నికలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీలకు న్యాయం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయికి నల్లమల విద్యార్థి ఎంపిక



అచ్చంపేట రూరల్: రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న అథ్లెటిక్ పోటీలకు నల్లమల ప్రాంతం అచ్చంపేటకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో పట్టణంలోని ఎంఎస్ఎన్ ఎక్సలెంట్ గ్రామర్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి శివరామకృష్ణ అండర్–10 విభాగంలో 100 మీటర్ల పరుగు పోటీలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థిని స్కూల్ కరస్పాండెంట్ సీఎంరెడ్డి, మన్సూర్‌ఖాన్, సైదులు, రాజేందర్ అభినందించారు.

దరఖాస్తు చేసుకోవాలి

మన్ననూర్: కార్పొరేట్ విద్యను సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాలమహానాడు రాష్ట్ర నాయకుడు కుంద మల్లికార్జున్ ఆదివారం ఒక ప్రకటన కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎస్సీ ఎస్టీ విద్యార్థులకు ఉచితంగా ప్రవేశం ఉంటుందని పేర్కొన్నారు. 1వ తరగతి, 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు జూన్ 7వ తేదీ లోపు జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పిడుగుపాటుకు మూగజీవాలు మృతి



వంగూరు: మండలం నిజాంబాద్ గ్రామ పరిసరాల్లో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు గురై ఒక ఆవు, మూడు మేకలు మృతిచెందాయి. రైతు లింగమయ్య సంబంధించిన ఆవు, పాపయ్యకు సంబంధించిన మూడు మేకలు పిడుగుపాటుకు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతులను ప్రభుత్వం ఆర్థికసాయం చేసి ఆదుకోవాలని కోరారు.

ఆచార్య కృపానందకు నివాళి



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో ఆదివారం ఆచార్య పెరికె కృపానంద సంస్మరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు కృపానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతాప్‌రాయ్, కవిత, వర్షారాయ్ పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్ అవార్డుకు అనసూయ ఎంపిక



ఎంపికైన పత్రం అందుకుంటున్న అనసూయ

తెలకపల్లి: మండలంలోని పెద్దపల్లి గ్రామానికి చెందిన చతమోని అనసూయ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికైంది. 2019 జనవరి నుంచి 2024 జనవరి వరకు పెద్దపల్లి సర్పంచ్‌గా గ్రామంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించడంతో బహుజన సమితి అకాడమి నేషనల్ కమిటీ అకాడమీ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు అనసూయను ఎంపిక చేశారు. అదేవిధంగా ఉత్తమ ఇంటర్‌నేషనల్ అవార్డుకు ఎంపికైంది. 2024 సంవత్సరానికిగాను పెద్దపల్లి సర్పంచ్ చతమోని అనసూయ ఎంపికకావడంతో అవార్డును బహుజన సమితి అకాడమీ నేషనల్ కమిటీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ ఉత్తమ సర్పంచ్ అవార్డుకు సంబంధించిన పత్రాన్ని ఆమెకు అందజేశారు. జూన్ 10వ తేదీన మహారాష్ట్రలోని పూణెలో అవార్డు అందుకోనున్నారు.

నిరుపయోగంగా మార్కెట్ కార్యాలయ భవనం



మార్కెట్ కార్యాలయ భవనం

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌లో పాత వ్యవసాయ మార్కెట్ కార్యాలయ భవనం నిరుపయోగంగా మారింది. ఎనిమిది సంవత్సరా కిందట నూతన వ్యవసాయ మార్కెట్ భవనం నిర్మించారు. ఈ కార్యాలయంలోనే ప్రస్తుతం కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. అప్పటి నుంచి పాత భవనం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. గతంలో ఈ భవనాన్ని అగ్రికల్చర్ డివిజన్ అధికారి కార్యాలయంగా మార్చేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. అయితే ఆదేశాలు వచ్చిన ఆ భవనంలోకి వచ్చేందుకు వ్యవసాయ శాఖ అధికారులు విముఖత తెలిపారు. దీంతో పాతభవనం ఖాళీగా ఉండటంతో చెత్తచెదారం పేరుకుపోయి అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై మార్కెట్ సెక్రెటరీ భగవంత్‌ను వివరణ కోరగా ఆ భవనాన్ని కూలగొట్టి షాపుల నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని అనుమతుల కోసం ఎదురు చూస్తున్నామని వివరించారు.

అధ్వానంగా రహదారులు



దెబ్బతిన్న అమరగిరి రోడ్డు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాలకు అనుసంధానంగా ఉన్న ప్రధాన రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. నడిచేందుకు కూడా ఇబ్బందిగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణానికి 8 కిలోమీటర్ల దూరంలో నల్లమల అడవి సమీపంలో కృష్ణానది ఒడ్డున ఉన్న అమరగిరి గ్రామానికి 15 సంవత్సరాల కిందట పంచాయతీ రాజ్ నిధుల నుంచి రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ నేటి వరకు అధికారులు, పాలకులు మరమ్మతు చేయలేదు. గత సంవత్సరం నుంచి గ్రామ సమీపంలో ఉన్న నది నుంచి పాలమూరు ప్రాజెక్టుకు ఒండ్రు మట్టి పెద్ద పెద్ద టిప్పర్ల నుంచి తరలించారు. భారీ వాహనాలు రోడ్డుపై తిరగడంతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గ్రామస్తులు ఎన్నో సార్లు అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామం పూర్తిగా అడవిలో ప్రాంతంలో ఉండటంతో అక్కడ చెంచులు, ఇతరులు నివాసం ఉంటున్నారు. ప్రతి రోజు వారు పట్టణానికి రావడానికి ప్రజలు నరక యాతన అనుభవిస్తున్నారు. అదే విధంగా ముక్కిడిగుండం గ్రామం నుంచి మొలచింతపల్లి వెళ్లే రహదారి, నార్లాపూర్ నుంచి కల్వకోలు వెళ్లే రహదారి కూడా పూర్తి దెబ్బతిన్నది. కుడికిల్ల నుంచి నార్లాపూర్ వెళ్లే రోడ్డు కూడా అధ్వానంగా తయారైంది. కొల్లాపూర్ నుంచి చౌటబెట్ల గ్రామం వెళ్లే రోడ్డు కూడా పూర్తి గా దెబ్బతిన్నది. ఇప్పటికైన అధికారులు స్పందించి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారులను బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఐదుగురిపై కేసులు నమోదు

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి, యాపట్ల మార్గంలో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో వివిధ ప్రాంతాలకు చెందిన 5 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్మోహన్ తెలిపారు. రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది సహదేవ్, కిషన్, కొండల్ పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ప్రారంభమెప్పుడో?

తాడూరు: ప్రయాణికుల సౌకర్యార్థం మండల కేంద్రంలో రెండేళ్ల కిందట బస్‌షెల్టర్ నిర్మించారు. కాని ఇప్పటికి ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివిధ గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ఎండలోనే నిల్చోవాల్సిన దుస్థితి నెలకొంది. మరుగుదొడ్లను కూడ ప్రారంభించకపోవడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి నిర్మించి బస్‌షెల్టర్‌ను ప్రారంభించాలని కోరుతున్నారు.